




వనపర్తి పట్టణలోని అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద మంచుతెరలను చీల్చుకొని ఉదయిసున్న సూర్యుడు



నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలుర మైదానంలో ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలో పాల్గొని ముగ్గులు వేస్తున్న మహిళలు



నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీలో మొదటి బహుమతి అందుకుంటున్న కే సంధ్య

పండుగలా ముత్యాల ముగ్గులు

- సంస్కృతీ సంప్రదాయాలకు అద్దం పట్టేలా రంగవల్లులు
- నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య
- ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీ విజయవంతం
- జిల్లా నలుమూలల నుంచి హాజరైన మహిళలు
- విజేతలుగా సంధ్య, అనూప, జ్యోతి

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సాంకేతిక కాలంలో రోజురోజుకు అంతరించుపోతున్న దేశ సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని నాగర్‌కర్నూల్ సీఐ కనకయ్య అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు.. గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పెర్‌ఫెక్ట్, ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్ వేర్) ఆధ్వర్యంలో విజయవంతమయ్యాయి. పట్టణంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల బాలుర మైదానంలో నిర్వహించిన ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు, విద్యార్థినులు పాల్గొన్నారు. ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల విద్యార్థిని సంధ్య దక్కించుకున్నారు. నాగర్‌కర్నూల్‌కు చెందిన ఎం అనూప ద్వితీయ బహుమతి, పెద్దకొత్త పల్లికి చెందిన డీ జ్యోతి తృతీయ బహుమతి గెలుచుకున్నారు. ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ అబ్దుల్లా ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ కనకయ్య, మునిసిపల్ చైర్ పర్సన్ కల్పన హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ముత్యాల ముగ్గుల పోటీలకు స్పాన్సర్లుగా నాగర్‌కర్నూల్‌కు చెందిన గీతాంజలి హైస్కూల్, గీతాంజలి అండ్ కిడ్స్ ప్రైమరీ స్కూల్, గీతాంజలి ఐఐటీ, నీట్ ఫౌండేషన్ వారు వ్యవహరించారు. ముగ్గుల పోటీ న్యాయ నిర్ణేతలుగా కౌన్సిలర్ బాదం సునీత నరేందర్, విశ్రాంత ఉపాధ్యాయురాలు యశోద వ్యవహరించారు. తాడూరు మండలం నుంచి ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులకు ఆ మండల రిపోర్టర్ రాజుగౌడ్ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ కనకయ్య మాట్లాడుతూ ఆధునిక సమాజంలో పండగలు కమర్షియల్ అయ్యావన్నారు. వ్యవసాయ ఆధారిత భారత దేశంలో పూర్వకాలం నుంచి నిత్యం పనుల్లో ఉండే రైతులు పండగలకు కుటుంబంతో కలిసి సంతోషంగా జీవించే వారని తెలిపారు. దేశ సంస్కృతిలో భాగంగానే సంక్రాంతి పండగకు ముగ్గులు వేస్తూ వస్తున్నారన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ఆధ్వర్యంలో ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థినులు ముగ్గుల నైపుణ్యంతో పాటు చదువులో కూడా రాణించాలని ఆకాంక్షించారు. మునిసిపల్ చైర్ పర్సన్ కల్పన మాట్లాడుతూ సంక్రాంతి పండగ వాతావరణాన్ని తలపించేలా ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముగ్గుల పోటీల్లో మహిళలు ముగ్గులు వేశారని ప్రశంసించారు. ఆంధ్రజ్యోతి అబ్దుల్లాఖాన్ మాట్లాడుతూ ముగ్గుల పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేసినందుకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో స్పాన్సర్ గీతాంజలి హైస్కూల్ యాజమాన్యం రాయ్ జోసెఫ్, క్లాస్‌మేట్ క్లబ్ వ్యవస్థాపకులు రాఘవేం దర్, ఏడీవీటీ వేణు, పీసీ ఇన్‌చార్జీలు ఎండీ సాజిద్, ఎండీ ముస్తాక్, వెంకటయ్య, రిపోర్టర్లు సీ వెంకటస్వామి, విజయ్ గౌడ్, రాజుగౌడ్, పృథ్వీరాజ్, కృష్ణయ్య, శేఖర్, కిరణ్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాణి, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం లత పాల్గొన్నారు.


మరిన్ని చిత్రాలు 7లో..

చాలా సంతోషంగా ఉంది



నాగర్‌కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో డెయిరీ సైన్స్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాను. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి రావడం సంతోషంగా ఉంది. సంక్రాంతి పండగ సంప్రదాయం ప్రతిబింబించేలా గొబ్బెమ్మలు, నవధాన్యాలతో అలంకరించి చుక్కల ముగ్గు వేశాను. ప్రతీ పండగకు ఇంటి దగ్గర ముగ్గులు వేస్తాను. జిల్లా స్థాయి ముగ్గుల పోటీల్లో పాల్గొనడం ఇదే మొదటి సారి.

- కే సంధ్య, మొదటి బహుమతి విజేత, నాగర్‌కర్నూల్




వనపర్తి పట్టణాన్ని కమ్మేసిన పొగ మంచు

మంచు కురిసే వేళలో..

వనపర్తి పట్టణంలో ఉదయం 10 దాటినా చలి తీవ్రత తగ్గడం లేదు. సాయంత్రం నాలుగు గంటలకు వీచే శీతల గాలులకు వెన్నులో వణుకు పుడుతోంది. శనివారం తెల్లవారుజామున వనపర్తి పట్టణాన్ని మంచు కమ్ముకొని ఊటీని తలపించింది. చుట్టూ ఉన్న పరిసరాలను కప్పేసింది. పదడుగుల దూరంలో ఏముందో కనిపించని పరిస్థితి నెలకొన్నది. దారి కనిపించక వాహనదారులు లైట్లు వేసుకొని ప్రయాణించగా.. తెల్లవారుజామున వివిధ పనుల నిమిత్తం వెళ్లేవారు స్వెటర్లు ధరించి వెళ్లారు. మంచు ధాటికి సూర్యుడు కూడా తొంగి చూడకపోవడంతో వెలుతురు వచ్చేసరికి తొమ్మిది గంటలైంది. పట్టణలోని రాజనగరం. అయ్యప్ప స్వామి దేవాలయం వద్ద మంచు ప్రభావం వల్ల సూర్యుడి కాంతి తగ్గినట్లు కనిపించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ వనపర్తి జిల్లా



వనపర్తి పట్టణలోని అయ్యప్ప స్వామి దేవాలయానికి వెళ్లే దారిలో పొగమంచులో బైక్‌పై వెళ్తున్న యువకులు



వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కేంద్రంలోని బస్టాండ్ వద్ద చలి మంట కాచుకుంటున్న మహిళ

హెల్మెట్ లేకుంటే కలెక్టరేట్‌లోకి నో ఎంట్రీ

- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : హెల్మెట్ లేకుండా కలెక్టరేట్‌లోకి వచ్చే ద్విచక్ర వాహనదారులకు నో ఎంట్రీ అని కలె క్టర్ బదావత్ సంతోష్ అన్నారు. జిల్లాలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. శనివారం జాతీయ రోడ్డు భద్రత మా సోత్సవాలను పురస్కరించుకుని జిల్లా రవాణా శాఖ ఆధ్వర్యంలో ముద్రించిన కరపత్రాలు, వాహనాలకు అంటించే అవగాహన స్టిక్కర్లను కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది అత్యంత ప్రాధాన్యమైందని అన్నారు. మానవ తప్పిదాల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని, ప్రమాదాలలో 18 నుంచి 45 సంవత్సరాలలోపు వారే ఎక్కువగా చనిపోతున్నారని, వీటిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులపై పోలీస్ స్పాట్ల వద్ద రేడియం స్టిక్కర్లతో కూడిన సూచికలను ఏర్పాటు చేయాలని ఆర్‌అండ్‌బీ అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రతి పాఠశాలల్లో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేలా వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించాలని డీఈవోను ఆదేశించారు. ద్విచక్ర వాహనాలు హెల్మెట్ లేకుంటే కలెక్టరేట్ లోకి అనుమతులు లేదని కలెక్టర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి చిన్నబాలు, డీఈవో రమేష్ కుమార్, ఆర్‌అండ్‌బీ ఈఈ, వివిధ శాఖల అధికారులు, ట్రాఫిక్ పోలీసులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రజిని

వనపర్తి రూరల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు చట్టాలపైన అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వీ రజని అన్నారు. శనివారం వనపర్తి మండలంలోని చిట్యాల జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు, మహిళలకు వరద బాధితులకు, మూడు లక్షల లోపు ఆదాయం ఉన్న వారందరికీ ఉచిత న్యాయ సహాయం అందుతుందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మహిళల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం గురువయ్య గౌడ్, డిఫెన్స్ లాయర్ ఉత్తరయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంధుల జీవితాల్లో వెలుగులు నింపిన బ్రెయిలీ



సన్మానం పొందిన అంధులతో వనపర్తి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అంధుల కోసం ప్రత్యేక లిపిని సృష్టించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని జిల్లా సంక్షేమశాఖ కార్యాలయంలో లూయిస్ బ్రెయిలీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమానికి వచ్చిన అంధులతో కలిసి కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రంగాల్లో ముందుండేలా ఆలోచించి లూయిస్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేశారన్నారు. అంధుల కోసం ప్రత్యేక లిపిన సృష్టించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు లూయిస్ బ్రెయిలీ అని చెప్పారు. అనంతరం అదనపు కలెక్టర్ ప్రభుత్వ ప్రధానోపాధ్యాయురాలు పెరవలి గాయత్రి, బ్యాంకు ఉద్యోగి మధు సహా పలువురు అంధులను సన్మానించారు. అంధులకు వాకింగ్ స్టిక్స్ అందజేశారు. లక్ష్మమ్మ, సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- ప్రారంభమైన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన

గద్వాల టౌన్/ధరూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో విద్యార్థులు సైన్స్ పట్ల ఆసక్తి, అవగాహనను పెంచుకోవాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ఇందుకు తోడ్పాటుగా జిల్లా సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలు శనివారం ప్రారంభమయ్యాయి. అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి ప్రదర్శనలు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి బాలలు రేపటి పౌరులే కాదు శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఇన్‌చార్జి డీఈవో అబ్దుల్ ఘని వైజ్ఞానిక ప్రదర్శనల ఆవశ్యకతను వివరించారు. ధరూరు మండలం రేవులపల్లి డీపీవీ మోడల్ స్కూలు విద్యార్థులు రూపొందించిన 'అడ్వాన్స్‌డ్ సెక్యూరిటీ అండ్ ఆటోమేటిక్ స్టాప్ మెట్రో ట్రైన్' నమూనాను ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హనుమంతు, కౌన్సిలర్లు, గద్వాల ఎంఈవో శ్రీనివాస్ గౌడ్, జిల్లా సైన్స్ అధికారి భాస్కర్ పాపన్న, ఎంఈవోలు ఉన్నారు. అదేవిధంగా జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అధికారులు పరిశీలించారు.



గద్వాలలో వైజ్ఞానిక ప్రదర్శనను జ్యోతివెలిగించి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, డీఈవో, అధికారులు



వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకిస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్‌లో సమస్యలు పరిష్కరించాలి

- సీడీఎంఏ శ్రీదేవికి విన్నవించిన మునిసిపల్ చైర్‌పర్సన్



సీడీఎంఏ శ్రీదేవికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ మనోరమ

అలంపూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక మునిసిపాలిటీలోని ప్రధాన సమస్యలు పరి ష్కరించాలని శనివారం చైర్‌పర్సన్ మనోరమ కమిషనర్, పుర పరిపాలన శాఖ సంచాలకులు టీకే శ్రీదేవి, టీజీఆర్టీసీ వైస్ చైర్మన్ వినోద్ కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం హైదరా బాద్‌లోని కార్యాలయాల్లో వేర్వేరుగా కలిశారు. పురపాలికలోని పెండింగ్ పనుల బిల్లులు, సి బ్బంది, కార్మికుల వేతనాలు చెల్లించాలని కోరారు. సీడీఎంఏ శ్రీదేవి సానుకూలంగా స్పందించి పెండింగ్‌లో ఉన్న పనులకు వీలైన నిధులను మంజూరు చేసి అలంపూరు అభివృద్ధికి సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు చైర్‌పర్సన్ తెలిపా రు. టీజీఆర్టీసీ వైస్ చైర్మన్‌ను కలిసి పట్ట ణంలోని జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం అలం పూరు నుంచి హైదరాబాద్, జిల్లా కేంద్రాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు.

హైందవ మతంలో దేవాలయాలకు ప్రత్యేక స్థానం

రంగనాయకస్వామి ఆలయంలో జియర్ స్వామి పూజలు

కందనూలు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అత్యంత పురాతనమైన శ్రీపురం శ్రీరంగనాయక స్వామి ఆలయాన్ని త్రిదండి శ్రీదేవనాథ జియర్‌స్వామి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పురాతన ఆలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. హైందవ మతంలో దేవాలయాలకు ప్రత్యేక స్థానం ఉందని, భక్తితోపాటు ఐక్యత పెంచడంలో ఆలయాలు కీలక భూమిక పోషించాయన్నారు. శ్రీపురం శ్రీరంగనాయకస్వామి ఆలయం ఎంతో మహిమ కలిగిన ఆలయమని, వైకుంఠ ఏకాదశి నాడు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవడం వల్లన పాపాలు తొలగిపోతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం, గోదాదేవి కల్యాణోత్సవాల కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తర రంగాచార్యులు, ప్రధాన అర్చకులు వినోదాచార్యులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



గోదాదేవి కల్యాణ ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జియర్‌స్వామి

ప్రసవాల సంఖ్య పెంచాలి

- జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న స్వరాజ్యలక్ష్మి

కోడేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల(పీహెచ్‌సీ)లో ప్రసవాల సంఖ్య పెంచాలని జిల్లా వైద్య శాఖ అధికారి స్వరాజ్యలక్ష్మి అన్నారు. శనివారం నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు పీహెచ్‌సీని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. మండలంలోని పసుపుల గ్రామంలో చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ ఇస్తున్న వారిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీహెచ్‌సీలలో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రతీ గర్భిణీ ప్రసవ ప్రణాళిక రూపొందించాలని ఏఎన్ఎంలకు సూచించారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్ నాయక్, డీపీవో రేణయ్య తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే పూర్తి చేయాలి



వెన్నాచేడ్‌లో ప్రభుత్వ బాలుర హాస్టల్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

● అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

గండీడ్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వేను త్వరగా పూర్తి చేయాలని మహబూబ్‌నగర్ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. శనివారం మండలంలోని వెన్నాచేడ్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. ఎస్సీ వసతి గృహం, బాలుర ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో ఎలాంటి తప్పులు జరుగకుండా చూడాలన్నారు. అర్హులైన వారి పూర్తి డేటా ఉండాలని తెలిపారు. వసతి గృహం బాత్ రూముల్లో లీకేజీ లేకుండా మరమ్మతు చేయాలన్నారు. కిచెన్ షెడ్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. ఎంపీవో నరేందర్ రెడ్డి, హెచ్ఎం మల్లిఖార్జున్, గ్రామ కార్యదర్శి కృష్ణనాయక్, వార్డెన్ మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచు పుల్లారెడ్డి, రాములు, పులేందర్ రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు రండి

మంత్రులకు ఆహ్వానం పలికిన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్



జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహకు ఆహ్వానపత్రం అందిస్తున్న డీఈవో ప్రవీణ్‌కుమార్

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం పోలేపల్లి సెజ్‌లోని ఎస్వీకేఎం పాఠశాలలో నిర్వహించే రాష్ట్ర స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను తిలకించడానికి రావాలని మంత్రులతో పాటు పలువురికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, డీఈవో ప్రవీణ్‌కుమార్, డీఎస్‌వో శ్రీనివాసులు శనివారం హైదరాబాద్‌లో ఆహ్వానం అందజేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర రాజనరసింహ, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్ అకునూరి మురళిలకు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 861 ప్రదర్శనలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 2,500 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ప్రదర్శనలు ప్రదర్శించనున్నారని పేర్కొన్నారు. వాటిలో ఇన్‌స్పైర్ విభాగంలో 300, ఆర్ఎస్ బీవీపీ విభాగంలో 561 ప్రదర్శనలను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. వైజ్ఞానిక ప్రదర్శన కోసం 26 కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమమైన ప్రదర్శనను జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారన్నారు. అందుకోసం ఢిల్లీ నుంచి ఎస్సీఈఆర్టీకి సంబంధించి న్యాయనిర్ణేతలు రానున్నారని చెప్పారు.

కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



మైసమ్మ అమ్మవారు

నవాబ్‌పేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పర్వతాపూర్ మైసమ్మ బ్రహ్మోత్సవాలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష అలంకరణ, అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్ జగన్మోహన్‌రెడ్డి, డైరెక్టర్లు మల్లేష్, రామస్వామి, రవి, బక్క నర్సింహులు, రాంచంద్రయ్య, కట్ట బాలస్వామి, ముర్గని బాలకిష్టయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ధర్నా



పీయూ పరిపాలన భవనం ముందు ధర్నా చేస్తున్న పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు

పాలమూరు యూనివర్సిటీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీలో తక్కువ వేతనాలతో పనిచేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు వెంటనే వేతనాలు పెంచాలని పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామ్మోహన్‌జీ డిమాండ్ చేశారు. శనివారం పీయూ పరిపాలన భవనంలో నాన్ టీచింగ్ ఉద్యోగులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీయూ ప్రారంభమైనప్పటి నుంచి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని ఇప్పుడున్న ఖర్చులకు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. వేతనాలు పెంచకపోతే పెన్‌డౌన్ చేసి, నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రత్యేక కమిటీ వేసి వేతనాలను ఏ ప్రాతిపదికన పెంచాలనేది నిర్ణయం తీసుకుంటామన్నారు. పీయూ నాన్ టీచింగ్ ఉద్యోగులు పర్వతాలు, రాము, నరసింహ, శ్రీనువాసులు, రాముయాదవ్, నరేష్, శ్రీను, రాగిణి, శ్వేత పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అధికారుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎంఆర్

అధికారుల సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రజల సమస్యలు తీర్చడంలో అధికారుల పాత్ర కీలకమని ఎమ్మెల్యే జీ.మధుసూదన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని పోతులమడుగు గ్రామ శివారులోని మినీ ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుకై నిర్వహించిన అధికారుల సమీక్షా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. మండలంలోని 18 గ్రామ పంచాయితీల ప్రజలతో ఎమ్మెల్యే గ్రామాల వారిగా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో ముఖ్యంగా లోవోల్టేజీ సమస్య ఉన్నట్లుగా ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తాగునీటి సమస్య, ప్రభుత్వ భూములను కొందరు ఆక్రమించుకున్నట్లుగా ప్రజలు సమావేశంలో చర్చించారు. స్పందించిన ఎమ్మెల్యే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. విద్యుత్ సమస్య విషయంలో ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానన్నారు. భట్టుపల్లి తండాలో స్కూల్ భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొటున్నట్లు ఎమ్మెల్యేకు వివరించారు. పాఠశాల భవనం, తాగు నీటి సమస్యను తీర్చడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందే విధంగా చొరవ తీసుకోవాలన్న లక్ష్యంతో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. గ్రామాల్లో వేధిస్తున్న ఇరిగేషన్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక తయారు చేస్తామన్నారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ డీఈఈ చంద్రమౌళి, ఈఈ చంద్రశేఖర్, సీఐ రామకృష్ణ, తహసీల్దార్ అబ్దుల్ రహమాన్, ఎంపీడీవో ప్రభాకర్ చారి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేసీరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకట నర్సింహ రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరే శేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ హర్యానాయక్ పాల్గొన్నారు.

సైక్లింగ్ పోటీలు ప్రారంభం



సైక్లింగ్ పోటీలు ప్రారంభిస్తున్న గోపాలం

మక్తల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర స్కూల్ గేమ్స్, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని మినీ స్టేడియంలో జిల్లా సైక్లింగ్ పోటీలను జిల్లా క్రీడల అధికారి వెంకటేష్‌శెట్టి, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గోపాలం జెండా ఊపి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన ప్రథమ, ద్వితీయ విజేతలను ఈనెల 6 నుంచి 8 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడలకు పంపిస్తామన్నారు.

కార్యక్రమంలో పీడీలు విష్ణువర్ధన్‌రెడ్డి, నరేష్, ఈశ్వర్, మీనాకుమారి, రాకేష్, విద్యాసాగర్, లావణ్య, రూప, రమేష్‌కుమార్, శ్రీలత, స్వాతి, రవీందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో బంగారు పతకాలు

ధన్వాడ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ధన్వాడ విద్యార్థులు బంగారు పతకం సాధించారు. డిసెంబరు 30 నుంచి జనవరి రెండో తేదీ వరకు హనుమకొండ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ధన్వాడ విద్యార్థులు పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా నుంచి 13 మంది క్రీడాకారులు పాల్గొనగా ఇందులో నలుగురు విద్యార్థినులు, తొమ్మిది మంది విద్యార్థులు ఉన్నారని కోచ్ శ్రీనివాసులు తెలిపారు. ధన్వాడకు చెందిన విద్యార్థినులు రజిత, బాలమణి, గీత, నాగలక్ష్మి గోల్డ్ మెడల్ సాధించినట్లు కోచ్ వివరించారు. వారిని జిల్లా క్రీడాలధికారి వెంకటేష్‌శెట్టి, కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ అభినందించారు.



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులు

గంగాపురం హుండీ ఆదాయం రూ.21 లక్షలు



హుండీలోని డబ్బులను లెక్కిస్తున్న భక్తులు

జడ్చర్ల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల మండలం గంగాపురం లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయానికి రూ.21,53,272 ఆదాయం వచ్చింది. శనివారం ఆలయ ప్రాంగణంలో ఈవో దీప్తిరెడ్డి, పర్యవేక్షకులు శ్రీనివాస్ సమక్షంలో హుండీలను లెక్కించారు. మార్చి 11, 2024 నుంచి 2025 జనవరి 3వ తేదీ వరకు భక్తులు హుండీలలో వేసిన కానుకలు లెక్కించినట్లు వారు తెలిపారు. నగదుతో పాటు 4.790 గ్రాముల మిశ్రమ వెండిని భక్తులు సమర్పించుకున్నారని పేర్కొన్నారు. ఆలయ ట్రస్టీ సభ్యులు జనార్దన్‌రెడ్డి, విశ్వం, గరుడగమన సేవా సమితి సభ్యులు, తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

ఈ నెల 28, 29 తేదీలలో కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో నిర్వహణ



అంతర్జాతీయ సెమినార్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న పీయూ వీసీ

కొల్లాపూర్/పాలమూరు యూనివర్సిటీ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ అనుబంధంగా ఉన్న కొల్లాపూర్ పీజీ సెంటర్‌లో ఈ నెల 28, 29 తేదీలలో మాస్టర్ ఆఫ్ సోషల్‌వర్క్ (ఎంఎస్‌డబ్ల్యూ) ఆధ్వర్యంలో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు పీయూ వీసీ జీఎన్ శ్రీనివాస్ తెలిపారు. శనివారం పాలమూరు విశ్వవిద్యాలయంలో కొల్లాపూర్‌లో నిర్వహించే అంతర్జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను పీయూ వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శ్రీనివాస్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, కొల్లాపూర్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ మార్క్‌పోలోనిస్ అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో పీయూ అధికారులు ఎంఎస్‌డబ్ల్యూ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

జెన్‌కో ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జెన్‌కో హైడల్ డైరెక్టర్ సచ్చిదానందానికి వినతి



హైడెల్ డైరెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న 1535 యూనియన్ సెంట్రల్ కమిటీ అధ్యక్షుడు ఎంఏ వజీర్

దోమలపెంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టీజీ జెన్‌కోలో నెలకొన్న ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని హైడల్ డైరెక్టర్ సచ్చిదానందానికి శనివారం హైదరాబాద్ విద్యుత్ సౌధలో 1535 యూనియన్ సెంట్రల్ కమిటీ నాయకులు ఆయనను కలిశారు. జెన్‌కోలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు సమస్యలు పరిష్కరించాలని విన్నివించడంతో ఆయన సానుకూలంగా స్పందించారని యూనియన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంఏ వజీర్, సుంకరి లవకుమార్ తదితరులు ఉన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్య

అచ్చంపేట టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అంజయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 సంవత్సరంలో నాల్గవ తరగతి చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు సాంఘిక, బీసీ, ఎస్టీ గురుకులలో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఆధార్ కార్డు, బోనఫైడ్, ఆదాయ, కుల ధ్రువీకరణ ప్రతాలతో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఎస్ఎస్ఏ ఉద్యోగుల మానవహారం

గద్వాల టౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డిమాండ్ల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె కొనసాగిస్తున్న సమగ్ర శిక్షా అభియాన్(ఎస్ఎస్ఏ) కాంట్రాక్ట్ ఉద్యోగులు 26వ రోజు శనివారం జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక కృష్ణవేణి చౌరస్తా వద్ద మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, పే స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమ్మెకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం తరఫున అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోహర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి మద్దతు ప్రకటించారు. సమ్మెలో గద్వాల అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్ స్పెషల్ ఆఫీసర్ శేషన్న, కేజీబీవీల స్పెషల్ ఆఫీసర్లు ఉన్నారు.




పట్టణంలో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు

శ్రీశైలం డ్యాంలో 109 టీఎంసీల నీటినిల్వ

- నాలుగు రోజులుగా పంపు మోడు నిలిపివేత

- ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో కొనసాగుతున్న విద్యుత్ ఉత్పత్తి

దోమలపెంట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా నది ఎగువ పరివాహక ప్రాంతం నుంచి శ్రీశైలం డ్యాంలోకి ఎటువంటి నీరు చేరడంలేదు. ఎగువ ఉన్న జూరాల ప్రాజెక్టులో విద్యుత్ ఉత్పాదన చేయడం లేదు. శనివారం శ్రీశైలం డ్యాం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడగులకు గాను 861.10 అడుగులకు చేరగా, 215.8070 టీఎంసీల గాను, 109, 2730 టీఎంసీల నీటి నిల్వలు ఉన్నట్టు డ్యాం గేజింగ్ అధికారులు పేర్కొంటున్నారు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో నాలుగు యూనిట్లలో 28,252 క్యూసెక్కుల నీటిని ఉపయోగించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నారు. కృష్ణానదికి అనుసంధానంగా ఉన్న కాలువకు ఎంజీకేఎల్ఐ 2,334, పీఆర్‌పీ 1,500, ముచ్చుమర్రి (కేసీసీ) 490 క్యూసెక్కుల నీటిని కాల్వల ద్వారా తరలిస్తుండగా, ఎడమ గట్టు విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తికి 28, 252 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న సాగర్‌కు విడుదల చేస్తున్నారు. కాగా ఎడమ గట్టు విద్యుత్ కేంద్రం 1వ యూనిట్ డ్రాఫ్ట్‌ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి లీకేజీ వాటర్ తీవ్రత తగ్గే వరకు జెన్‌కో అధికారులు పంపుమోడ్ (డ్యాంలోకి నీటి మళ్లింపు)ను పరిశీలిసున్నందున నాలుగు రోజులుగా పంపుమోడ్‌తో పాటు 1వ యూనిట్‌లో వితుత్ ఉత్పత్తి కొనసాగించవద్దని జెన్‌కో అధికారులు నిర్ణయించారు.



శ్రీశైలం డ్యాంలో నీటిమట్టం

శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

బిజినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): జేష్టాదేవి సమేత సార్థసప్త శనీశ్వర స్వామికి భక్తిశ్రద్ధలతో భక్తులు తైలాభిషేకాలతో ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ప్రధాన పూజారి డాక్టర్ గవ్వమఠం విశ్వనాథశాస్త్రి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలంలోని నందివడ్డెమాన్‌లోని నందీశ్వరాలయం ఆవరణలోని శనీశ్వరస్వామికి శనివారం భక్తులు నల్లని దుస్తులు ధరించి నువ్వుల నూనె, జిల్లేడు పూలు, నల్లని నువ్వులతో పూజలు చేశారు. శనీశ్వరస్వామిని ఏడు వారాల పాటు పూజించిన అనంతరం ఆలయ ఆవరణలోని నందీశ్వరుడికి, పరమశివునికి వివిధ రకాల పండ్ల రసాలు, బిల్వ పత్రాలతో అభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహిస్తే స్వామి వారి కృపకు నోచుకుంటారని ప్రధాన అర్చకులు వివరించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు తాగునీటి వసతి, అల్పాహారం ఏ ర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్ రావు తెలిపారు. కార్యక్రమంలో పూజారులు ఉమామహేశ్వర్, శాంతికుమార్, ఆలయ కమిటీ సభ్యు లు ప్రభాకరాచారి, వీరశేఖర్ తదితరులు ఉన్నారు.



నందివడ్డెమాన్‌లోని శనీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

వంకేశ్వరం విద్యార్థికి జిల్లా మొదటి ర్యాంకు

పదర, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక శాస్త్ర ప్రతిభా పాఠవ పరీక్షలో మండలంలోని వంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థి రాకేష్ మొదటి ర్యాంకు సాధించాడు. ఈ మేరకు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో సాంఘిక ప్రతిభా పాటవ పరీక్ష నిర్వహించినట్లు ఆయన తెలిపారు. వంకేశ్వరం జడ్పీ ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థి రాకేష్ మొదటి ర్యాంకు సాధించడంతో ఆ విద్యార్థిని ఉపాధ్యాయులు పాండు, నిరంజన్, బురాన్, అంజనమ్మ అభినందించారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఏబీవీపీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థులు, ఏబీవీపీ నాయకులు

గద్వాల న్యూటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వం బాధ్యత వహించాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నరేష్ తేజ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ఏబీవీపీ ఆధ్వర్యంలో గురుకులాల విద్యార్థులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రాష్ట్రంలోని గురుకులాలు విద్యార్థుల చావు కేకలతో మార్మోగుతున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే సుమారుగా గురుకులాల్లో 49 మంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. కొన్ని గురుకులాల్లో విద్యార్థులు పాము కాటుకు బలయ్యారని, మరికొంతమంది ఫుడ్ పాయిజన్‌తో మరణించారన్నారు. ఇంకొందరు అధికారుల వేధింపులకు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. ఇంత జరుగుతున్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో పాటు ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయడం లేదన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఉమ్మడి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

వంగూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా వంగూరు మండల కేంద్రంలో ఈ నెల 11వ తేదీన ఉమ్మడి మహబుబ్‌నగర్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు హరిప్రసాద్, జంగీర్‌లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ బహుమతి రూ.10 వేలు ఉంటుందని, ఆసక్తి ఉన్న యువకులు టీమ్‌ల పేర్లను నమోదు చేసుకోవాలని వారు పేర్కొన్నారు.

మురిసిన ముగ్గులు

» పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న వనితలు
» నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో నిర్వహణ
» ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన

ముత్యాల ముగ్గులు మెరిసి.. మురిపించి... మైమరిపించాయి. ఇలపై ముద్దాడాయి. నాగర్‌కర్నూల్, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో శనివారం నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పెర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా (ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో నిర్వహించింది. ఈ పోటీల్లో వనితలు రంగుల హరివిల్లును ఇలపై పరిచారు. గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా ఆరు వేలు, రెండో బహుమతిగా నాలుగు వేలు, మూడో బహుమతిగా మూడు వేల నగదును అందజేశారు. ముగ్గుల ఎంపికలో న్యాయనిర్ణేతలు చాకచక్యంగా వ్యవహరించారు.

- నాగర్‌కర్నూల్ టౌన్, గద్వాల/వడ్డేపల్లి, వనపర్తి రాజీవ్‌చౌరస్తా


జోగులాంబ గద్వాల జిల్లా శాంతినగర్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

నాగర్‌కర్నూల్


నాగర్‌కర్నూల్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత కె.సంధ్య


నాగర్‌కర్నూల్‌లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత ఎం.అనూప


నాగర్‌కర్నూల్‌లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత డి.జ్యోతి

జోగులాంబ గద్వాల


గద్వాల జిల్లా శాంతినగర్‌లో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత గౌతమి


గద్వాల జిల్లా శాంతినగర్‌లో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత సుమిత్ర


గద్వాల జిల్లా శాంతినగర్‌లో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత లావణ్య

వనపర్తి


వనపర్తిలో ముత్యాల ముగ్గుల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత కవిత


వనపర్తిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత అరుణశ్రీ


వనపర్తిలో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, (ఇన్‌సెట్‌లో) విజేత సునీత


నాగర్‌కర్నూల్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు తదితరులు


గద్వాల జిల్లా శాంతినగర్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు


వనపర్తిలో ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు తదితరులు



వనపర్తిలో స్పాన్సర్స్ లోగోలను వేస్తున్న మహిళ

నేడు రౌండ్ టేబుల్ సమావేశం

» పాలమూరు అధ్యయన వేదిక

పాలమూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): డిండి ఎత్తిపోతల పేరున పాలమూరు-రంగారెడ్డి పథకం నీరు తరలింపు ప్రతిపాదన ఉపసంహరించుకోవాలన్న అంశాలపై ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవోల భవనంలో రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు పాలమూరు అధ్యయన వేదిక తెలిపింది. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జి.హరగోపాల్, కన్వీనర్ ఎం.రాఘవాచారి, ఎ.తిమ్మప్ప, ఎం. వెంకట్రాములు, జి.వెంకట్‌గౌడ్, కె.వెంకటేశ్వర్లు, ఎం.డి ఇక్బాల్‌పాషా, కె.రవీంద్రనాథ్‌లు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

వ్యతిరేకించారు. పాలమూరు-డిండి ఎత్తిపోతల పథకం చేపట్టాలనే ప్రతిపాదన సరైంది కాదని తెలిపారు. పాలకులు మారినప్పుడు తమ ఆలోచనను మార్చుకోవటం సరికాదని, 14 నియోజకవర్గాల ఉమ్మడి జిల్లా జలవనరుల కల్పన కృష్ణానది నీటిలో తెలంగాణ రాష్ట్ర వాటా సాధన తదితర అంశాలపై చర్చిస్తామన్నారు. సమావేశంలో జలవనరుల నిపుణులు, పార్టీలు, ప్రజా సంఘాల ప్రతినిధులు, ప్రజాస్వామిక వాదులు అధికసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలనుంచి రౌండ్‌టేబుల్ సమావేశం ఉంటుందని తెలిపారు.

1994లోనే కృష్ణానదిలో నీటి వాటాకోసం మహబూబ్‌నగర్ జిల్లాలోనే తెలంగాణ ఉద్యమం ప్రారంభమైందని గుర్తుచేశారు.

ఆనాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు బహిరంగ లేఖ రాశామన్నారు.

2013లోనే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మనం జూరాల నుంచి నీరు తీసుకునే విధంగా సాధించుకున్నామని తెలిపారు. తొమ్మిదన్నరేళ్లపాలించిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం, ఏడాది నుంచి కాంగ్రెస్ పాలన చూస్తూనే ఉన్నాం.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దూకుడుగా మరోసారి డిండి ఎత్తిపోతల పనులకు తెగబడటం సరికాదన్నారు.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరేనా?

» పేట జిల్లాకు 2500 ఎకరాలు టార్గెట్
» ఇదివరకు సాగైంది 50 శాతం మాత్రమే
» అధికారులు కోరుతున్నా ముందుకు రాని రైతన్నలు

దామరగిద్ద, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట జిల్లాలో 2024-25 ఏడాదికిగాను 2500 ఎకరాలు ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం కేటాయించింది. జిల్లా కలెక్టర్ 1500 ఎకరాలకు మంజూరు చేసి మొక్కలు నాటేందుకు ఆర్డర్లు ఇచ్చింది. కానీ ఇదివరకు 700 ఎకరాలు మాత్రమే ఆయిల్ పామ్ సాగు చేశారు. ఇంకా కొందరు రైతులు ఇప్పుడు ఇప్పుడే మొక్కలు నాటుతున్నారని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు తెలిపారు. ఆయిల్ పామ్ సాగుతో మంచి లాభాలు ఉన్నాయని, ప్రభుత్వం పెద్ద ఎత్తున రాయితీ ఇస్తుందని ఆయిల్ పామ్ సాగుకు రైతులు ముందుకు రావాలని అధికారులు కోరుతున్నారు. కానీ రైతులు మాత్రం పెద్దగా ఆసక్తి చూపడం లేదు. రాయితీ విషయానికి వస్తే ఆయిల్ పామ్ సాగు చేసుకునే ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం రాయితీ కల్పించింది. చిన్న సన్నకారు రైతులకు 90 శాతం రాయితీ కల్పించింది. కేవలం 10 శాతం మాత్రమే రైతు వాటాగా భరించాలి. అయినా రైతులు మాత్రం అంతగా ఆసక్తి చూపకపోవడం గమనార్హం. ఒక్క ఎకరాకు రూ. 4200 చొప్పున నాలుగు సంవత్సరాలకు రూ. 16,800 రాయితీన ప్రభుత్వం చెల్లిస్తుంది. రైతు వాటాగా కింద రూ. 1140 చెల్లించి రైతు ఆయిల్ పామ్ సాగు చేసుకోవచ్చని జిల్లా ఉద్యాన శాఖ అధికారులు రైతులను కోరుతున్నారు. ఇతర పంటల కంటే ఆయిల్ పామ్ సాగుతో మంచి లాభాలు పొందవచ్చన్నారు. దీంతో పాటు ఆయిల్ పామ్ సాగు చేస్తున్న పొలంలో అంతర పంటగా పెసర, వేరుశనగ, కంది, మిరప, సాగు చేసుకుని రైతులు లాభం పొందవచ్చన్నారు. ఈ విషయమై జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ మాట్లాడుతూ బోరు వసతి ఉన్న రైతులు ఆయిల్ పామ్ సాగుకు ముందుకు రావాలని రైతుకు రాయితీపై ప్రభుత్వం డ్రిప్ పరికరాలు అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని నీటి వసతి ఉన్న రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మార్చి 2025 నాటికి ఆయిల్ పామ్ లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు.


ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖ అధికారులు

భూ బదలాయింపు కేసులో ఇద్దరు తహసీల్దార్లపై కేసు నమోదు

అమ్రాబాద్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూలు జిల్లా అమ్రాబాద్ మండలం కేంద్రానికి చెందిన మాలె శంకరయ్యకు చెందిన 900 సర్వే నంబరులో ఐదు గుంటల భూమిని పలకపల్లి అలీ అనే వ్యక్తికి బదలాయింపు చేసిన విషయంలో ఇద్దరు తహసీల్దార్లపై కేసు నమోదు చేసినట్లు అమ్రాబాద్ ఎస్‌ఐ రజిత తెలిపారు. ఈ మేరకు శనివారం ఆమె విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శంకరయ్య పేరు మీద ఉన్న 900 సర్వే నంబరులో ఉన్న ఒక ఎకరం 10 గుంటల భూమిలో ఎకరా భూమిని గతంలో ఆర్టీసీ బస్టాండ్ కోసం ఇవ్వగా, మిగిలిన 10 గుంటలకు గాను ఐదు గుంటల భూమిని గతంలో ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్లు జి.పి.పాల్, జె.కృష్ణయ్యలు పలకపల్లి అలీ పేరిట చేశారని శంకరయ్య ఇటీవల ఒక ప్రైవేట్ సివిల్ కోర్టులో కేసు వేశారు. విచారణ అనంతరం కోర్టు తీర్పును వెలువరించింది. కోర్టు ఆదేశాల మేరకు ఇద్దరు తహసీల్దార్‌లపై ఐపీసీ 420, 199 సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని ఎస్‌ఐ వివరించారు.

నలుగురు ఆకతాయిలకు పోలీస్ కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): అమ్మాయిలను వేధిస్తున్న నలుగురు ఆకతాయిలకు పోలీసులు కౌన్సెలింగ్ ఇచ్చారు. భరోసా కేంద్రంలోని షీటీమ్ కార్యాలయంలో ఆకతాయిలకు శనివారం డీఎస్పీ వెంకటేశ్వర్లు కౌన్సెలింగ్ చేశారు. ఎస్పీ జానకి ఆదేశాల మేరకు షీటీమ్స్ అమ్మాయిలను వేధిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకున్నాయి. వీరికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ చేశారు. మొదటి తప్పుగా కౌన్సెలింగ్ చేస్తున్నామని, మళ్లీ చేస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇలాంటి చట్ట విరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలను గౌరవించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌జీవోస్ చంద్రశేఖర్, జగపతిరావు, రాజసింహుడు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



ఎంపికైన లక్ష్మి గోవర్ధన్

గద్వాల అర్బన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లాకు చెందిన లక్ష్మి, గోవర్ధన్‌లు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనగామ జిల్లాలో గత నెల డిసెంబర్ 27 నుంచి 30వరకు జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలుర విభాగం నుంచి గోవర్ధన్, హకీంపేటలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాలికల కబడ్డీ పోటీల్లో లక్ష్మి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల జిల్లా కబడ్డీ అడ్‌హక్ కమిటీ ఛైర్మన్ డీకే స్నిగ్ధారెడ్డి, కన్వీనర్ అబ్రహాంలు శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 8 నుంచి 11 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జరిగే జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని వారు తెలిపారు. అభినందించిన వారిలో సీనియర్ కబడ్డీ క్రీడాకారులు తిరుపతి, రజనీకాంత్, కబడ్డీ నరసింహ, సురేష్, రవి, చందు, కరెంటు నరసింహ, టి.నాగేష్, జగదీష్, రైల్వే పాషా, రఘు, వెంకటన్న, కృష్ణ, మహేష్, శివశంకర్ ఉన్నారు.

వాలీబాల్ పోటీలకు మూసాపేట యువకుడు


మహ్మద్ హబీబొద్దీన్

మూసాపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లో జరిగిన జాతీయ స్థాయి వాలీబాల్ ఎంపిక క్రీడా పోటీల్లో మూసాపేట మండల కేంద్రానికి చెందిన మహ్మద్ హబీబొద్దీన్ నేషనల్ లెవల్ సీనియర్స్ వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 7 నుంచి 13 వరకు రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్‌లో జరుగబోయే నేషనల్ లెవల్ సీనియర్స్ వాలీబాల్ క్రీడా పోటీలకు హాజరు కానున్నారు. ఇతను తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులోని డీఆర్‌ఎన్‌జీపీ ఆర్ట్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. గతంలో కూడా జమ్మూకశ్మీర్‌లో జరిగిన జూనియర్స్ లెవల్ వాలీబాల్ పోటీల్లో ఆడి తమదైన ప్రతిభ కనబర్చారు. జాతీయ స్థాయి సీనియర్ వాలీబాల్ పోటీలకు మహ్మద్ హబీబొద్దీన్ ఎంపిక కావడం పట్ల అతని తండ్రి మహ్మద్ మొహియోద్దిన్, మాజీ ఉపసర్పంచి తాజోద్దిన్, నేతాజీ యువజన సంఘం అధ్యక్షుడు ఉందేకోడు కృష్ణ, మాజీ అధ్యక్షుడు శెట్టిశ్రావణ్, బల్లె నవీన్, ఆరీఫొద్దీన్, ముఖ్తార్ తదితరులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.



ఇంటర్వ్యూ..

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- ఎస్ఐ కె. శ్రీనివాస్, బిజినేపల్లి



బిజినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మారుతున్న కాలానికి అనుగుణంగా యంత్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకొని కొందరు కేటుగాళ్లు వివిధ మోసాలకు, డిజిటల్ దొంగతనాలకు పాల్పడుతున్నారని ఎస్ఐ కె. శ్రీనివాస్ అన్నారు. వివిధ సమస్యలపై ఆంధ్రజ్యోతితో ఆయన మాట్లాడారు.

బిజినేపల్లి పోలీసు స్టేషన్ పరిధిలో ఆర్థిక మోసాలు జరుగుతున్నట్లు గుర్తించారా?

పోలీసు స్టేషన్ పరిధిలో 35 గ్రామ పంచాయతీలతో ఉమ్మడి జిల్లాలోనే పెద్ద మండలం. వాట్సప్‌లో వచ్చే ఏపీకే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని బ్యాంక్ ఖాతాల్లో డబ్బు పోయినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో తక్కువ పెట్టుబడి ఎక్కువ డబ్బు ఇస్తామంటే ఆశ్చాతో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఉదంతం గుర్తించాం. సైబర్ సెల్ పోలీసుల ద్వారా కేటుగాళ్లను గుర్తించి బాధితులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తున్నాం. ఆన్‌లైన్ మోసానికి గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నెంబరు 1930కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలి.

సైబర్ నేరాల నివారణ చర్యలు ఏంటి?

సైబర్ నేరాలపై ప్రజలు అవగాహన కల్గి ఉండాలి. ఎవరైనా ఓటీపీ నెంబరు కాని, బ్యాంక్ ఖాతాల్లో తక్కువ మొత్తానికి ఎక్కువ మొత్తం ఇస్తామని మాయ మాటలు చెబితే వెంటనే పోలీసులకు కాని, సంబంధిత బ్యాంక్ శాఖ అధికారులకు గాని సమాచారం ఇవ్వాలి. సెల్‌ఫోన్‌లో అనవసరమైన యాప్‌లు డౌన్‌లోడ్ చేసుకోవడం, వాట్సప్ గ్రూప్‌లో వచ్చే లింక్‌లను ఓపెన్ చేయడంపై జాగ్రత్తపడాలి. వ్యక్తిగత సమాచారాన్ని ఎవ్వరికి షేర్ చేయొద్దు.

విద్యార్థులకు పాఠశాల స్థాయి నుంచే
సామాజిక బాధ్యతను పెంపొందించాలి

- పీఆర్‌టీయూ క్యాలెండర్ ఆవిష్కరణలో కలెక్టర్ బదావత్ సంతోష్



పీఆర్‌టీయూటీఎస్ సంఘం క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు మెరుగైన విద్యాబోధనతో పాటు పాఠశాల స్థాయి నుంచే వారిలో సామాజిక బాధ్యత కలిగి ఉండేలా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతీ ఉపాధ్యాయుడిపై ఉందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ప్రోగ్రెసివ్ రికగ్నైజ్ టీచర్స్ యూనియన్ తెలంగాణ స్టేట్ (పీఆర్‌టీయూ టీఎస్) 2025 సంవత్సర నూతన క్యాలెండర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సమాజం పట్ల, కుటుంబ సభ్యుల పట్ల, తోటి వారి పట్ల బాధ్యతతో మెలిగేలా ఉపాధ్యాయులు తప్పనిసరిగా అవగాహన కల్పించాలని కోరారు. విద్యార్థులకు ఏ అంశం పట్ల ఆసక్తి ఉందో ఆదే అంశాన్ని క్షుణ్ణంగా ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలని కోరారు. పదవ తరగతి ఫలితాల్లో జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఆదివాసీ అధికారి రోహిత్‌రెడ్డి, టీచర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బల్మూర్ రామచంద్రారావు, తుమ్మల సురేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు సుభాషత్ విశ్వనాయక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, పీఆర్‌టీయూటీఎస్ రాష్ట్ర, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



లబ్ధిదారుకు చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా బాలుర పరిషత్ ఉన్నత పాఠశాలలో తాగునీటి మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎంఈవో జీవన్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ 270 చెక్కులను, సీఎం రిలీఫ్ ఫండ్ 137 చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు ఉన్నారు.

ప్రతీ గర్భవతి సురక్షిత మాతృత్వం పొందాలి

- డీఎంహెచ్‌వో డాక్టర్ కే.స్వరాజ్యలక్ష్మి

కందనూలు/ పెద్దకొత్తపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ గర్భవతి సురక్షిత మాతృత్వం పొందాలని, ప్రతీ చిన్నారికి సంపూర్ణ టీకాకరణే మన లక్ష్యమని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ కే. స్వరాజ్యలక్ష్మి అన్నారు. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని దేశిటిక్యాల, పెద్దముద్దనూర్ గ్రామాల్లోని ఆరోగ్య ఉప కేంద్రాలను శనివారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. దేశిటిక్యాల గ్రామంలో టీకీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ రవికుమార్, ఎంపీహెచ్‌ఈవో రాజేశ్, డీపీఎం కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ

పెద్దకొత్తపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, జిల్లా టీబీ అధికారి రవిశంకర్‌లు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రాబోయే వేసవి కాలంలో ఎండల తీవ్రత పట్ల ప్రజలను అప్రమత్తం చేస్తూ అవగాహన కల్పించాలని వారు వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఈ వైద్యాధికారి జీవీ శ్రీనివాస్, ఫార్మసిస్ట్ సంపత్, వినోద్, దేవమ్మ, ఆయాష్ వైద్యాధికారి మనస్విని తదితరులు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం



బాధితునికి సీఎంఆర్‌ఎఫ్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

చారకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు వరంలాటిదని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండలంలోని శేరి అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జాను అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందాడు. సీఎం ఆర్ఎఫ్ కోసం జాను దరఖాస్తు చేసుకొన్నారు. మంజూరైన రూ. 45వేల చెక్కును బాధితునికి శనివారం కల్వకుర్తి ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద లకు కార్పొరేట్ వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం అన్నారు. సీఎం సహాయనిధి పేదలకు భరోసా కల్పిస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సురేష్, పురందాస్, మహేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భూనిర్వాసితుల ఖాతాల్లో పరిహారం జమపై హర్షం



ఎమ్మెల్యే రాజేశ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న మాజీ సర్పంచ్ అవంతి, శంకర్‌లు

బిజినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మార్కండేయ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మాణంలో భూ ములు కోల్పోయిన నిర్వాసిత అన్నదాతల ఖాతాల్లో శనివారం రూ. 89,28,038 పరిహారం నిధులు జమ కావడంపై మాజీ సర్పంచ్ అవంతి శంకర్ హర్షం వ్యక్తం చేశారు. పరిహారం అందించడంలో గత ప్రభుత్వ నాయకులు తాత్సారం చేశారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రస్తుత ప్రభుత్వ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి చొరవ తీసుకొని నిధులు విడుదల చేయించడంతో బాధిత రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డికి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అవంతి శంకర్, దస్తగిరి, మండల కాంగ్రెస్ నాయకులు మిద్దె రాములు, బంగారి పర్వతాలు, మాజీ ఎంపీటీసీ అంజయ్యలు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ వెంకటస్వామి, మాజీ సర్పంచులు అమృత్ రెడ్డి, తిరుపతయ్య, హరీష్ రెడ్డి, రాంచందర్ నాయక్, వీరేందర్, దీప్లా నాయక్, శాయిన్‌పల్లి, గంగారం గ్రామాల రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

మోడల్ హౌస్ కోసం స్థల పరిశీలన



మోడల్ ఇంటి కోసం స్థలం పరిశీలిస్తున్న జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సంగప్ప, హౌసింగ్ అధికారులు

కోడేరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మోడల్ ఇంటి నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించినట్లు జిల్లా హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ సంగప్ప తెలిపారు. నమూనాగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మోడల్‌గా నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇస్తున్న ఐదు లక్షలతో ఇల్లు నిర్మించుకోవచ్చని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రావణ్‌కుమార్, హౌసింగ్ ఏఈ రాఘవేందర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల పక్షపాతి ప్రధాని మోదీ



ప్రధానమంత్రి మోదీ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కల్వకుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : పీఎం కిసాన్ సమ్మాన్ నిధిని రూ.6వేల నుంచి 10వేల వరకు పెంచడంతో పాటు దేశవ్యాప్తంగా రెండు కోట్ల ఇళ్ల నిర్మాణం ద్వారా ప్రధాని మోదీ ప్రజలకు నూతన సంవత్సర కానుక ఇచ్చారని బీజేపీ జిల్లా నాయకులు నోముల రవి అన్నారు. శనివారం మండలంలోని ఎల్లికట్టలో ప్రధానమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మోదీ సర్కార్ రైతు బాంధవుడని క్షీరాభిషేకం చుట్టించిన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతయ్య, చింతకాయల బంగారి, మదనాచారి, మల్లేష్, గంట కృష్ణయ్య, వంగ బాబయ్య, మధుసూదన్‌రెడ్డి, బజారు జంగిలయ్య, వెంకటేశ్, బ్యాగరి రామకృష్ణ, కేశవులు, మహేష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ లబ్ధిదారుల పరిశీలన

బిజినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ద్వారా లబ్ధిపొందుతున్న రైతుల భౌతిక పరిశీలన కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు చేపట్టినట్లు ఏఈవో క్రాంతి కుమార్ తెలిపారు. మండలంలోని మంగనూర్‌లో శనివారం ఇంటింటికి తిరిగి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి లబ్ధిదారుల వివరాలు, ఫోటో తీసుకొని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. మంగనూర్ క్లస్టర్ పరిధిలోని గౌరారం, గౌరారం తండాల్లో 95 మంది లబ్ధిదారులను నమోదు చేసుకొని ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు తెలిపారు.

శాస్త్రోక్తంగా ధనుర్మాస ప్రత్యేక పూజలు



పాలెం వేంకటేశ్వర స్వామి ఆలయంలో ధనుర్మాస పూజలో పాల్గొన్న భక్తులు

బిజినేపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలెంలోని అలువేలు మంగ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో పుష్య మాసం పంచమి శనివారం ధనుర్మాస ప్రత్యేక పూజలు భక్తుల శాస్త్రోక్తంగా నిర్వహించినట్లు ఆలయ ప్రధాన అర్చకులు రామానుజాచార్యులు తెలిపారు. ధనుర్మాసం ప్రారంభమై 20 రోజుల నుంచి ప్రతి రోజు తెల్లవారు జామున ఐదు గంటలకు స్వామి వారికి సుప్రభాత సేవ, తిరుప్పావై సేవా కాలం, గోదా అమ్మవారికి ప్రత్యేకంగా కుంకుమార్చన, పుష్పార్చన, మహ మంగళ హారతి వేద మంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహిస్తున్నారు. భక్తులకు పాశురాల విశిష్టతను వివరిస్తున్నారు. ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు, నైవేద్యం వితరణ చేపట్టారు. కార్యక్రమంలో అర్చకులు జయంత్, శుక్లా, చక్రపాణి, ఆలయ సిబ్బంది బాబయ్య, వెంకటేష్, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పోడు భూముల రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఇవ్వాలి

- తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్

కొల్లాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్‌లో పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసి గిరిజనులకు గత ప్రభుత్వం ఇచ్చిన హక్కు పత్రాలకు బ్యాంకులు రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ గిరిజన సంఘం ఆధ్వర్యంలో కొల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు. అశోక్ మాట్లాడుతూ జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్న ఆదివాసి గిరిజనులు రుణాలు కోసం బ్యాంకుల చుట్టూ తిరిగినా రుణం పొందక నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఇతర జిల్లాల్లో పోడు భూములకు హక్కు పత్రాలు పొందిన వారికి బ్యాంకుల్లో రుణాలు ఇస్తున్నారని, ఈ జిల్లాలో పోడు భూములు సాగు చేసుకుంటున్న రైతులకు బ్యాంకుల్లో రుణాలు ఇప్పించాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గోవిందరెడ్డికి, గిరిజన సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నాయక్, శ్రీను నాయక్, గణేష్ నాయక్, విష్ణు, రాము, లాలమ్మ పాల్గొన్నారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల వాల్‌పోస్టర్ విడుదల

తిమ్మాజీపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయంభువుగా వెలిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆలయ కమిటీ సభ్యులు శనివారం ఆవిష్కరించారు. ఈనెల 12వ తేదీ నుంచి 14వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని తెలిపారు. మాజీ ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటయ్య, ఆలయ కమిటీ సభ్యులు రామచంద్రారెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, ఎల్లారెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ

- రజత పతకాలు సాధించిన యువకులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మణ్, రాందాస్

మన్ననూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలోని బాలయోగి క్రీడా మైదానంలో జరుగుతున్న 11వ తెలంగాణ మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీలలో అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామానికి చెందిన గిరిజన యువకులు ప్రతిభ చాటి రజత, కాంస్య పతకాలను సాధించారు. కేరళలో జరగబోయే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. శనివారం జరిగిన అథ్లెటిక్స్ పోటీలలో భాగమైన ట్రిపుల్ జంప్‌లో మన్ననూరు గ్రామానికి చెందిన విస్తావత్ లక్ష్మణ్ ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంపొంది రజత పతకాన్ని సాధించగా, 5 కిలో మీటర్ల వాకింగ్‌లో మన్ననూరు గ్రామానికి చెందిన రాందాస్ ద్వితీయ స్థానం పొంది రజత పతకం, 10 కిలో మీటర్ల వాకింగ్‌లో తృతీయ స్థానం పొంది కాంస్య పతకాలను సాధించారు. రాష్ట్ర స్థాయి క్రీడ అధికారుల చేతుల మీదుగా యువకులు పతకాలను, ప్రశంసా పత్రాలను అందుకున్నారు. బాల్యం నుంచి క్రీడలంటే ఇష్టపడే రాందాస్ అచ్చంపేట రాజాలో కానిస్టేబుల్, లక్ష్మణ్ పదర జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ క్రీడల్లోనూ పాల్గొంటున్నారు. ప్రతిభ చాటిన యువకులను పలువురు ఉద్యోగులు, మన్ననూరు గ్రామస్థులు ప్రత్యేకంగా అభినందించారు.

డప్పు కళాకారుల కమిటీ ఏర్పాటు

తెలకపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో డప్పు కళాకారుల సంఘం మండల కమిటీ ఎన్నుకొంది. మండలంలోని గ్రామాల డప్పు కళాకారులు మండల కేంద్రంలోని యోగా భవనంలో శనివారం కమిటీని ఎన్నుకున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడిగా బొప్పెల్లి సుల్తాన్, జిల్లా ఉపాధ్యక్షుడు కే. శ్రావణ్‌కుమార్, బైరెడ్డ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దప్పు లక్ష్మణ్ బిజినేపల్లి మండల అధ్యక్షులు శివ ఆధ్వర్యంలో తెలకపల్లి మండల డప్పు కళాకారుల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొమ్ము ఆనంద్, ఉపాధ్యక్షులుగా రెడ్డిపాకుల రమేష్, శివాజీ, బొప్పెల్లిసురేష్, ప్రధాన కార్యదర్శిగా రెడ్డిపాకుల మల్లేష్‌బాబు, సహాయ కార్యదర్శులుగా విష్ణుగౌతంపల్లి, ముద్దుల రాజు అనంతసాగర్, కోశాధికారి పి.మల్లేష్, ప్రచార కార్యదర్శులుగా వంద, బొల్లె జగన్, గౌరవ అధ్యక్షులుగా రెడ్డిపాకుల రమేష్, చక్రపాణి, బందారి సుధాకర్, రెడ్డిపాకుల కృష్ణయ్య, గుగ్గిళ్ల ప్రకాశ్, సలహాదారులుగా బాలగాని రమేష్, గడ్డమీది ఆంజనేయులు, బి.శివశంకర్, ఆర్‌.బాబు, సోషల్ మీడియా ఇన్‌చార్జ్ సంపత్, శివతో కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు-వెయ్యి గొంతులు ప్రదర్శనను విజయవంతం చేయాలని ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ఇన్‌చార్జి దప్పు స్వామి కోరారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చేయాలని వారు కోరారు.

ఉమామహేశ్వర క్షేత్రంలో ఆర్‌అండ్‌బీ ఈఈ పూజలు

అచ్చంపేటటౌన్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైలం ఉత్తరముఖ ద్వారం ఉమామహేశ్వర క్షేత్రంలో శనివారం ఆర్‌అండ్‌బీ ఈఈ మైసంపాటి నరేందర్ దంపతులు ఈశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు ఆలయ ఈవో శ్రీనివాసరావు, ఆలయ కమిటీ చైర్మన్ బీరం మాధవరెడ్డి, అర్చకులు వీరయ్యలు మంగళ స్వాగతం పలికారు. పాపనాశిని గుండంలో పుణ్యస్నానాలు ఆచరించి ఈశ్వరునికి క్షీరాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, గణపతి అయ్యప్పస్వాములకు ప్రత్యేక పూజలు చేశారు. కాలువతో మనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేగంగా సంక్షేమ పథకాల అమలు



షాదీ ముబారక్ చెక్కును అందజేస్తున్న నంది హన్మంతరెడ్డి

మన్ననూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పథకాలను వేగంగా అమలుచేస్తున్నాయని మార్కెట్ కమిటీ డైరెక్టర్ నంది హన్మంతరెడ్డి అన్నారు. అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన 5గురు లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను, ముగ్గురికి సీఎం ఆర్ఎఫ్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో కోట్ల మాజీ సభ్యుడు రహీం, కాంగ్రెస్ నాయకులు రాజారాం, రాజేంద్ర ప్రసాద్, శంకరయ్య, శివాజీ, వెంకటయ్య, నిరంజన్, అంజనేయులు, కృష్ణయ్య పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

మాజీ ఎమ్మెల్యేను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

చారకొండ, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శనివారం పీఏసీఎస్ డైరెక్టర్ బొమ్మరమోని రమేష్, మాజీ కో-ఆప్షన్ సభ్యుడు సలీం, బీఆర్ఎస్ నాయకులు కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

'చుక్కాయిపల్లి గ్రామాన్ని మునిసిపాలిటీ నుంచి తొలగించాలి'

కొల్లాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కొల్లాపూర్ మునిసిపాలిటీ పరిధిలో ఉన్న చుక్కాయిపల్లి గ్రామాన్ని మునిసిపాలిటీ నుంచి తొలగించి, గ్రామ పంచాయతీగా గుర్తించాలని తెలంగాణ మాదిగ దండోరా జిల్లా అధ్యక్షుడు దేవని కుమార్ మాదిగ మంత్రి జూపల్లి కృష్ణారావుకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గతంలో మునిసిపాలిటీ పరిధిలో ఉన్న చుక్కాయిపల్లి గ్రామానికి ఇద్దరు కౌన్సిలర్లు ఉన్నారని, గ్రామ పంచాయతీ అయితే గ్రామానికి ఒక సర్పంచ్, ఒక ఉప సర్పంచ్, 10 వార్డు మెంబర్లు ఉంటారని, కాబట్టి ఇప్పటికైనా గ్రామాన్ని మునిసిపాలిటీ నుంచి తొలగించాలని కోరారు.

కల్వకోల్‌ను మండలంగా చేయాలని ఆర్డీవోకు వినతి

పెద్దకొత్తపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకోల్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ కొల్లాపూర్ రెవెన్యూ డివిజన్ అధికారికి ఆ గ్రామ నాయకులు శనివారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఏనిమిదేళ్ల నుంచి కల్వకోల్‌ను మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోనే రెండవ పెద్ద గ్రామ పంచాయతీ కల్వకోల్ అని అన్నారు. కార్యక్రమంలో కొత్తపేట సొసైటీ వైస్ చైర్మన్ రాము యాదవ్, ప్రవీణ్, గిరిప్రసాద్, పవన్‌యాదవ్, నూనె వెంకటేష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

కల్వకుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను అధికారులతో పాటు ప్రజలు సైతం పర్యవేక్షించాలని కల్వకుర్తి మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్ కోరారు. పనులు సకాలంలో నాణ్యతగా పూర్తి చేయాలని కోరారు. కల్వకుర్తి పట్టణంలోని 13వ వార్డులో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ఏజాస్, గోరటి శ్రీనివాసులు, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జమ్ముల శ్రీకాంత్, పలువురు నాయకులు రామకృష్ణ ఉన్నారు.

హమాలీల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

కల్వకుర్తి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : హమాలీల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సివిల్ సప్లయ్ హమాలీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలయ్య డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణంలోని సివిల్ సప్లయ్ గోదాం ముందు సివిల్ సప్లయ్ గోదాం హమాలీస్, జీసీసీ హమాలీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం నాల్గవ రోజుకు చేరుకుంది. బాలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి జీవో విడుదల చేసి హమాలీలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, జంగయ్య, కృష్ణ, నరేష్, బీరయ్య, మల్లేష్ ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి : రాష్ట్ర ప్రభుత్వం నూతన రేట్ల పెంపు, జీవో విడుదల చేసి పెంచిన రేట్లను అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సివిల్ సప్లయ్ హమాలీల సమ్మె శనివారం నాలుగో రోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ హమాలీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సివిల్ సప్లై హమాలీలు రాజు, లక్ష్మణ్, మైబు, రామదాసు, లింగస్వామి, మల్లేష్, మహేష్, సుధాకర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలి

- ఎస్ఐకి ఫిర్యాదు చేసిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు

తిమ్మాజీపేట, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : అనుచిత వ్యాఖ్యలు చేస్తూ బీఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి అసభ్యకరంగా వాట్సప్, సోషల్ మీడియా ద్వారా హెచ్చరిస్తున్న కాంగ్రెస్ నాయకులపై చర్యలు తీసుకోవాలని శనివారం బీఆర్ఎస్ నాయకులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరేందర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. పోతిరెడ్డిపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి ఇటీవల బూతు మాటలు మాట్లాడుతూ హాని కలిగించే విధంగా వ్యవహరిస్తున్నాడని పేర్కొన్నారు. అతనితో పాటు మరో వ్యక్తి ద్వారా తమకు ప్రాణహాని ఉందని, అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జోగు ప్రదీప్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు తిరుపతయ్య గౌడ్, నాగయ్యగౌడ్, వెంకటయ్య, పరశురాములు తదితరులు ఉన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

తాడూరు, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : ఆడిషనల్ ఎస్పీ సీహెచ్.రామేశ్వర్ ఆదేశాలతో మండల పరిధిలోని ఇంద్రకల్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు షీటీం ఆధ్వర్యంలో పోక్సో చట్టం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆడిషనల్ ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు ఇన్‌స్టాలో పరిచయాలు, ఆకర్షణకు గురై మోసపోతున్నారని, విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైతే ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ ఉపాధ్యాయులు శేఖర్‌గౌడ్, ఆధ్యాపకులు, విద్యార్థులు, షీటీమ్ మెంబరు వెంకటయ్య పాల్గొన్నారు.

రేపు సింగోటానికి మంత్రి జూపల్లి

కొల్లాపూర్, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : సింగోటం గ్రామంలో పాఠశాల ఆదనపు గదుల ప్రారంభానికి ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వస్తున్నారని గ్రామ మాజీ సర్పంచ్ ఇమ్మిడిశెట్టి వెంకటస్వామి, రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి దర్శిత తెలిపారు. సింగోటం గ్రామంలో ప్రభుత్వ ఉన్నత, ప్రైమరీ పాఠశాల్లో రూ. 40లక్షలతో పనులు చేపట్టినట్లు వారు తెలిపారు.

చెరువు కట్టపై చెట్ల తొలగింపు

పెద్దకొత్తపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వెన్నచర్ల పెద్ద చెరువు కట్టపై చెట్లు మొలచి ప్రమాద భరితంగా మారడంతో వాటిని తొలగింపు కార్యక్రమం మాజీ ఎంపీపీ సూర్య ప్రతాప్‌గౌడ్ సహకారంతో చేపట్టారు. ఆ గ్రామ మాజీ ఎంపీటీసీ సభ్యులు డి.రవికుమార్ శనివారం ఎక్స్‌కవేటర్‌తో పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ లు పర్వతాలు, భాస్కర్‌రెడ్డి, కుంటి పిల్ల రాముడు, వంగూరు రాంప్రసాద్, ముచ్చపోతుల శంకర్, మల్లేష్, అర్జున్, వెంకటేష్, రాముడు, బాలస్వామిలు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

ఉప్పునుంతల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన ఉప్పునుంతలలోని జడ్పీ హెచ్ పాఠశాల ఆవరణలో శనివారం ఎస్టీయూ డైరీ, క్యాలెండర్ రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) ప్రధాన కార్యదర్శి కత్త శ్రీధర్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పోకల సతీష్, కార్యదర్శి సత్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలపై ఎస్టీయూ పోరాడుతుందన్నారు. ఎంఈవో చంద్రశేఖర్, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఎస్టీయూ నాయకులు వెంకటయ్య, విష్ణుమూర్తి, జిల్లా కౌన్సిలర్ కేతావత్ రామకృష్ణ, రాజు, శ్రీనివాసులు, రాజశేఖర్‌రెడ్డి, సరళ ఉన్నారు.

బొలెరో ఢీకొని మహిళ మృతి

తెలకపల్లి, జనవరి 4 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గౌరారంలో బొలెరో వాహనం ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాలు... గౌరారం గ్రామానికి చెందిన సల్వాది చెన్నమ్మ(70) పొలం పనులు ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా బొలెరో ఢీకొని మృతి చెందింది. బొలెరో డ్రైవర్ మహేష్ కుమార్ కృష్ణా జిల్లాకు చెందినవాడని, జరిగిన సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.